## పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు

పరిగి, జూన్ 8 : నేడు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రూప్ వన్ పరీక్ష ఉన్నందున పరిగి పట్టణంలోని జిరాక్స్ సెంటర్లు మూసి వేయాల్సిందిగా పరిగి ఎస్ఐ సంతోష్ పేర్కొన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అందువల్ల పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడరాదని ఎస్ఐ సూచించారు.

## ఉరేసుకొని వ్యక్తి మృతి

పూడూరు, జూన్ 8 : కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందిన ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండల కేంద్రంలోని పిరంగి మహేశ్ (24) వారం రోజుల క్రితం కుటుంబ సభ్యులతో గొడవ పడి మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడి తండ్రి కాషయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పరిగి ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మహేశ్‌కు భార్య నిఖిత, 6నెల బాబు ఉన్నట్లు, భార్య వారం రోజుల క్రితం గొడవ పడి వికారాబాద్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి తల్లి గారింటికి వెళ్లినట్లు బంధువులు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి



శివాజీ, అనిత (ఫైల్)

కొడంగల్, జూన్ 8: దినవారాలకు వెళుతూ.. ఆగిఉన్న లారీని ఢీ కొట్టి భర్తతో పాటు భార్య మృతి చెందిన ఘటన కొడంగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండలంలోని దామర్‌చేడ్ గ్రామానికి చెందిన కమ్మరి శివాజీ (40), భార్య అనిత (38) శనివారం దౌల్తాబాద్ మండలంలోని కుప్పగిరి గ్రామంలో బంధువుల ఇంట్లో దినవారాల్లో పాల్గొనేందుకు బైక్‌పై శుక్రవారం రాత్రి బయలుదేరారు. ఈ క్రమంలో కొడంగల్ నుంచి చిట్లపల్లి స్టేజీ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌లారీని గమనించకుండా ఢీకొట్టారు. దీంతో భార్యాభర్తలిద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు శివాజీ మేస్త్రీ పని, భార్య కూలి పనులు చేసుకొంటూ జీవిస్తుండేవారు. వీరికి ఒక కుమారుడితో పాటు నలుగురు కూతుర్లు ఉన్నారు. ఘటనకు సంబంధించి మృతుడు శివాజీ తమ్ముడు సంతోశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. కొడంగల్ ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# గ్రామగ్రామాన బడిబాట

పూడూరు, జూన్ 8: బడీడు పిల్లలను పొలం పనులకు తీసుకు వెళ్తే చట్టరీత్యా నేరమని మండల విద్యాధికారి హరిచందర్ పేర్కొన్నారు. శనివారం పూడూరు మండలం తిర్మలాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ పెంటయ్య, మన్నెగూడ కాంప్లెక్స్ హెచ్ఎం రత్న కలిసి ఇంటింటికీ వెళ్లి బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంఈవో హరిచందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ సభ్యులు రాకేశ్, వినోద్, సీఆర్‌పీ గాలయ్య, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.



పూడూరు: తిర్మలాపూలో బడిబాట కార్యక్రమంలో ఎంఈవో హరిచందర్, మాజీ సర్పంచ్ పెంటయ్య

**గ్రామాల్లో పర్యటిస్తున్న ఉపాధ్యాయులు బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచిస్తున్న సిబ్బంది**

### ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

మర్పల్లి : ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈవో విద్యాసాగర్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఉపాధ్యాయులు మండలంలోని కోట్‌మర్పల్లి, కల్‌ఖోడా తదితర గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

### పల్లెపల్లెలో..

ధారూరు : గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పీఆర్టీయూ ధారూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మాణిక్యం పేర్కొన్నారు. శనివారం ధారూరు మండల పరిధిలోని నాగసముందర్, పులిచింతల మడుగుతండా, తరిగోపుల, తదితర గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, దుస్తువులు, మధ్యాహ్న భోజనం, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయులు శ్రీనివాస్, మాణిక్యం పాల్గొన్నారు.

### పలు గ్రామాల్లో..

కులకచర్ల : మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, ఏఏపీసీ కమిటీ సభ్యులు పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి గ్రామాల్లోని ఇండ్లకు వెళ్లి పిల్లలను పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. ప్రతి రోజూ పిల్లల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు మండల విద్యాధికారి అబీబ్‌హైమద్ తెలిపారు. కులకచర్ల మండలం సాల్వీడ్ గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమం సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల గౌరవాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మర్పల్లిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



ధారూరు: నాగసముందర్ గ్రామంలో బడిబాట కార్యక్రమం



కులకచర్ల : సాల్వీడ్‌లో బడిబాట కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సతీశ్‌కుమార్..

## తాగునీటి సరఫరాకు చర్యలు




పెద్దేముల్‌లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి చంద్రప్ప

పెద్దేముల్, జూన్ 8 : గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్లపై నిర్వహించే ఇంటింటి సర్వేను పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీగా నిర్వహించాలని మండల ఎంపీడీవో జర్నప్ప అన్నారు. ఈ మేరకు గ్రామాల్లో కొనసాగుతున్న ఇంటింటి సర్వే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశాలమేరకు శనివారం నుంచి సుమారు 10 రోజులపాటు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్లపై ఇంటింటికీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా? లేదా ? ఉంటే ప్రతి రోజూ నీళ్లు వస్తున్నాయా? తదితర విషయాలపై మిషన్ భగీరథ సర్వేయాప్‌లో పకడ్బందీగా నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వారిపైనా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

బొంరాస్‌పేట, జూన్ 8 : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ భగీరథ పథకంపై ప్రస్తుత ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నది. సర్వేలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించి ఆ ఇంటికి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా, ఉంటే తాగునీరు రోజూ వస్తుందా, రోజు విడిచి రోజు వస్తున్నాయా, స్వచ్ఛమైన నీరు వస్తుందా అనే విషయాలను ఇంటి యజమానిని అడిగి ఆ సమాచారాన్ని యాప్‌లో నమోదు చేస్తున్నారు. సమాచారం నమోదుతో పాటు ఇంటి యజమాని ఫొటోను కూడా తీసుకుంటున్నారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని గ్రామాల్లో సర్వేను పంచాయతీ కార్యదర్శులు శనివారం ప్రారంభించారు. పది రోజుల్లో సర్వేను పూర్తి చేయాలని జిల్లా అధికారులు ఆదేశించారు. మిషన్ భగీరథ పథకంలోని లోపాలను సరిదిద్ది ప్రజలకు నిరంతరంగా తాగునీటిని అందించడానికి ప్రభుత్వం ఈ సర్వేకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తున్నది.



కులకచర్ల : ముజాహిద్‌పూర్‌లో వివేకానంద విగ్రహానికి భూమిపూజ చేస్తున్న బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతికిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు

## ‘వివేకానందుడి అడుగుజాడల్లో నడువాలి’

కులకచర్ల, జూన్ 8 : యువత వివేకానంద అడుగుజాడల్లో నడువాలని బీజేపీ పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జి భూనేటి మారుతికిరణ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. శనివారం కులకచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో స్వామి వివేకానంద విగ్రహప్రతిష్ఠాపనకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని ఆయన సూచించిన మార్గాలను యువత ఆచరించాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఘనాపురం వెంకటయ్యగౌడ్, కాటన్‌పల్లి అంజిలయ్య, కేశవులు, జానకీరాం, మోనాచారి, బుచ్చన్న, మహిపాల్, ఆంజనేయులు, అనిల్, విజయేందర్‌పటేల్, వెంకటయ్య, నర్సింహులు, రాజు, హన్మంతు, వెంకటేశ్, గ్రామస్తులు విజయ్‌కుమార్, అనంతయ్య, మల్లేశ్, బిచ్చయ్య, శివకుమార్, ప్రభాకర్, అమర్, సదానంద్, గోపాల్, శ్రీను పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కులకచర్ల, జూన్ 8 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన కులకచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కులకచర్ల ఏఎస్ఐ సత్యశీలారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలానికి చెందిన బషీర్(56) వృత్తిరీత్యా వికారాబాద్ జిల్లా కేంద్రంలో పని చేస్తున్నాడు. గత నెల 21న లింగాల గ్రామం నుంచి వికారాబాద్‌కు వెళుతున్న క్రమంలో కులకచర్ల మండలం కామునిపల్లి గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికుల సమాచారం మేరకు 108లో పరిగి ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి నిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

**తిర్మలాపూర్ పంచాయతీ ఎదుట పారిశుధ్య కార్మికుల ధర్నా**



కులకచర్ల, జూన్ 8 : పది నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తిర్మలాపూర్ గ్రామ పంచాయతీ కార్మికులు జీపీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 10 నెలల నుంచి తమకు జీతాలు ఇవ్వడం లేదని కార్మికులు పేర్కొన్నారు. జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి జీతాలు వచ్చే విధంగా చూడాలని అన్నారు. తమ సమస్యను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు.

## లోక్ అదాలత్‌లో 528 కేసులు పరిష్కారం




పరిగి: లోక్ అదాలత్‌లో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప

పరిగి, జూన్ 8 : పరిగిలోని కోర్టులో లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 528 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప అధ్యక్షతన లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్ కేసులు మొత్తం 528 పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి భక్తకుమార్, పీపీ దీపరాణి, ఏజీపీ వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

**కొడంగల్‌లో..**

కొడంగల్ : స్థానిక మున్సిఫ్ కోర్టులో శనివారం మెగా లోక్‌అదాలత్ నిర్వహించి పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జనార్దన్ లోక్‌అదాలత్ కార్యక్రమంలో కక్షదారులకు అవగాహన కల్పించారు. లోక్‌అదాలత్‌లో రాజీకుదుర్చుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో 282 విద్యుత్ కేసులు, 27 క్రిమినల్, 59 డ్రంక్ అండ్ డ్రైవ్, 14 లైసెన్స్ కేసులతో పాటు 9 ఎక్సైజ్ కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంటయ్యగౌడ్, కృష్ణయ్య, సీసీ యాదయ్య, లోక్‌అదాలత్ సిబ్బంది ఫకీరప్ప, దస్తప్ప, సీఐ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



కొడంగల్‌లో..

## వ్యవసాయ విశ్వవిద్యాలయం చుట్టూ దుర్గంధం

- జంతు కళేబరాలకు నిలయంగా మారిన వర్సిటీ భూములు

వ్యవసాయ యూనివర్సిటీ,జూన్ 8 : వ్యవ సాయ విశ్వవిద్యాయలం స్థలాలు చెత్తకుప్పలకు నిలయంగా మారి దుర్గంధం వెదజల్లు తున్నాయి. అయినప్పటికీ జీహెచ్ఎం పారిశుధ్య విభాగం తమకు పట్టనట్టుగా వ్యవహారిస్తున్నది. రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాయానికి చెందిన దాదాపు 2 వేల ఎకరాల్లో చుట్టూ స్థానికులు చెత్త వేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతున్నది. బుద్వేల్, రాజేంద్రనగర్, డైరీఫామ్, నేషనల్ ఫిషరీస్ అకాడమీ, విజయ ఆయిల్ స్టేషన్ సమీపంలో నేరుగా ప్రహరీ గోడ కూల్చి ప్రజలు చెత్తా చెదారం పడేస్తున్నారు. ప్రధానంగా వీధి కుక్కలు సమీప కాలనీలలో చనిపోతే వాటిని వర్సిటీ స్థలాలలో పడవేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి కళేబరాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నది. దాంతో క్యాంపస్‌లో నివాసం ఉంటున్న విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ విషయమై ప్రశ్నించడంతో కొందరు సెక్యూరిటీ సిబ్బందిని బెదిరిస్తున్నట్లు తెలిసింది. స్థలాలకు భారీగా డిమాండ్ ఉండటం, వ్యాపార సంస్థలకు అనువుగా ఉన్నందున ముందు ప్రహరీ కూల్చడం, చెత్తా చెదారం వేయడం, ఆక్రమించుకోవడం కనిపిస్తున్నది. విజయ ఆయిల్ ఫిల్లింగ్‌స్టేషన్ సమీపంలో కుంటను స్థానిక నేతల సహకారంతో ఆక్రమిస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

## బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలి



బాధిత రైతుతో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్న

కులకచర్ల, జూన్ 8 : చౌడాపూర్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ లింగన్నపల్లిలో పిడుగుపాటుకు 5గేదెలు మృతి చెందగా, రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్న ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఐదు గేదెలు లింగన్నపల్లి గ్రామానికి చెందిన రైతు లాలును కలిసి పిడుగుపాటుకు గురైన మృతి చెందిన గేదెలను పరిశీలించారు. అనంతరం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్, పశువైద్యాధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. పశువైద్య సిబ్బంది ఘటనా స్థలాన్ని గేదెలను పరిశీలించిన అనంతరం పూడ్చి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన లాలును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రూ. 10లక్షలు బాధితుడికి సాయం అందేలా అధికారులు కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం తరలిస్తే పీడీ యాక్టు

కందుకూరు, జూన్ 8 : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తాసీల్దార్ రఘునందన్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని వివిధ రేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాలు ప్రారంభం కాగానే కొందరు ఆటోల్లో వచ్చి గ్రామాల్లో లబ్ధిదారుల వద్ద బియ్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నారని చెప్పారు. ఆటోలు, దళారులపై నిఘా ఉంచి అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకొని పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, జూన్ 8: నియోజకవర్గ పరిధిలో మంజూరైన పలు అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి భూమిపూజ చేశారు. శనివారం కొడంగల్‌తో పాటు బొంరాస్‌పేట, దుద్యాల, కోస్గి, దౌల్తాబాద్ మండలాల్లో ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, ఎంపీ ఎన్నికలకు ముందు అభివృద్ధి పనులకు కోట్లాది నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే సీఎం లక్ష్యమన్నారు. బొంరాస్‌పేట మండల పరిధిలో కుదురుమల్ల నుంచి పోలెపల్లి వయా దుద్యాల, లింగంపల్లి గేటు నుంచి సర్జఖాన్‌పేట, కోస్గి మండల పరిధిలో నాచారం నుంచి సర్జఖాన్‌పేట్, కొడంగల్ మండల పరిధిలో హస్నాబాద్ నుంచి నీటూర్, అంగడిరైచూర్ గేట్ నుంచి రుద్రారం, రావులపల్లి నుంచి మద్దూర్ గ్రామాల రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌తో పాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.

### కొడంగల్ అభివృద్ధికి పెద్దపీట

బొంరాస్‌పేట, జూన్ 8 : కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేసి అభివృద్ధి చేస్తున్నారని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. బొంరాస్‌పేట మండలంలోని లింగన్‌పల్లి స్టేజి నుంచి దుద్యాల వరకు రూ.26 కోట్లతో మంజూరైన బీటీ రోడ్డు పనులకు, దోమ మండలం దాదాపూర్ శివారు నుంచి దుద్యాల మండలం పోలేపల్లి, దుద్యాల మీదుగా కుదురుమల్ల వరకు రూ.50 కోట్లతో నిర్మించే బీటీ రోడ్లకు దుద్యాల మండల కేంద్రంలో శనివారం ఆయన భూమిపూజ చేసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సీఎం కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం బాపల్లితండా గ్రామానికి చెందిన హరిచందర్‌కు చికిత్స నిమిత్తం మంజూరైన రూ.1.30 లక్షల ఎల్‌వోసీ ఉత్తర్వులను తిరుపతిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బొంరాస్‌పేట, దుద్యాల మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహులుగౌడ్, శేఖర్, పార్టీ నాయకులు రాజేశ్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

### యువతి అదృశ్యం

కులకచర్ల, జూన్ 8 : యువతి అదృశ్యమైన ఘటన కులకచర్ల మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కులకచర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గండీడ్ మండలం చిన్నవార్వాల్‌కు చెందిన మహాలక్ష్మి (19) చౌడాపూర్‌లో తన చిన్నమ్మ అయిన చెన్నమ్మ దగ్గర ఉంటుంది. చెన్నమ్మ 7వ తేదీన తాను అనారోగ్యంగా ఉన్నందున మహబూబ్‌నగర్ దవాఖానకు వెళ్లి చూయించుకొని ఇంటికి రాగా, ఇంట్లో మహాలక్ష్మి లేకపోవడంతో తండ్రి మల్లేశ్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపారు.

## యూనిఫామ్‌ల అందజేత

పరిగి, జూన్ 8: పరిగి మండలంలోని సయ్యద్‌మల్కాపూర్ గ్రామంలో బడిబాటలో భాగంగా మహిళా సంఘాల సభ్యులు కుట్టిన పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌లను శనివారం ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. ఈ సందర్భంగా వాటిని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలల నోడల్ ఆఫీసర్, జడ్పీహెచ్‌ఎస్ నెం.1 ప్రధానోపాధ్యాయుడు గోపాల్, ఐకేపీ ఏపీఎం కె.శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుక్మిణి, సంఘం గ్రామ అధ్యక్షురాలు రాధ, ఉపాధ్యాయుడు శ్యాంసుందర్, సీసీ సంజీవ్, వీవోఏ జ్యోతి పాల్గొన్నారు.



యూనిఫామ్‌లను విద్యార్థులకు అందజేస్తున్న నోడల్ ఆఫీసర్ గోపాల్

## ఉద్యమకారుడు చంద్రశేఖర్‌రెడ్డికి ఘన నివాళి

వికారాబాద్, జూన్ 8 : తెలంగాణ ఉద్యమం, వికారాబాద్ ప్రాంతంలో విద్యా సేవలో దివంగత చంద్రశేఖర్‌రెడ్డి పాత్ర మరువలేనిదని వికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని వికాస్ జూనియన్ కళాశాలలో తెలంగాణ ఉద్యమకారుడు, వికాస్ జూనియర్ కళాశాల మాజీ కరెస్పాండెంట్ దివంగత పులిగారి చంద్రశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వికారాబాద్ ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఆయన వెంట కళాశాల డైరెక్టర్ పి.రాంరెడ్డి, కళాశాల అధ్యాపకులు, మున్నూరు సోమారం ఉన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వికాస్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

**పత్రిక ప్రకటన**

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన (1) వట్లూరి రిషిక్ తండ్రి వట్లూరి శివలింగం, వయస్సు 15 సం॥లు, (2) వట్లూరి జాగృతి తండ్రి వట్లూరి శివలింగం, వయస్సు 13 సం॥లు, ఇంటి నెం.1-108/ఎ, కేశంపేట గ్రామం మరియు మండలం, రంగారెడ్డి జిల్లా వాసులం తేది: 05-02-2024 సోమవారం రోజు ఆమన్‌గల్ నుండి హైదరాబాద్‌కు బస్సులో వెళ్తుండగా అజాగ్రత్త కారణం చేత తనకు సంబంధించిన ఒరిజినల్ ప్లాటు డాక్యుమెంట్ (డాక్యుమెంట్ నెం.11931/2013) పోయినది. కావున సంబంధిత డాక్యుమెంట్ ఎవ్వరికైనా లభించిన ఈ క్రింది అడ్రస్‌లో అప్పజెప్పగలరు.

**S. SAJJAD AHMED**
Advocate, Notary & Translator
Clock Tower, Mahabubnagar
Cell : 9440415676

**PUBLIC NOTICE**

Under the instructions of my client by name Puri Veeresh, S/o. Puri Chandrasheker, Age: about 21 years, R/o. Lahoti Colony, Kodangal Village and Mandal, Vikarabad District. I herby issue this Public Notice as under: That My client purchased the house bearing No. 1-1/6/7A, situated at Kodangal Village and Mandal through Registered Document Vide No. 890/2022, Dated 05-09-2022 from the Jinat AbdulKalam and 2 others, further it is informed that my client vendors rectification Link Original Document vide No. 888/2022, Dated 05-09-2022 which was lost, executed by Late Sheri Sanga Reddy, S/o. Thamanappa, R/o. Kodangal in favour my client vendors.

The general public is hereby cautioned not to deal with the person / persons entering into any transaction with respect to the above mentioned house property basing on the lost document shall be doing so at their risk and such transactions shall not be honoured.

If the above document is found the same may be returned to the addressee given below within 15 days from the publication of this notice.

Sd/- **Venkataiah Goud,** Advocate
Kodangal-509 338,
**Mobile No. 9490237339.**
Date: 09-06-2024